జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 137 30-5-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## నాకూ మినహాయింపొద్దు

- ఎస్ఐఆర్‌పై ఓ అసెంబ్లీ నియోజకవర్గాన్ని కేటాయించండి: సీఎం రేవంత్‌రెడ్డి
- క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో కలిసి పనిచేస్తా
- టీపీసీసీ పీఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి
- పార్టీ కోసం మంత్రులు, ఎంపీలు అంతా పని చేయాల్సిందే...
- వచ్చే ఎన్నికల్లో కోటికిపైగా ఓట్లు వస్తేనే 100 సీట్లు వస్తాయి..
- 'సర్'లో ఒక్క ఓటూ పోకుండా చూడాలి



హైదరాబాద్: 'పార్టీ కోసం అందరూ పనిచేయాల్సిందే. కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులతో సహా. నాకు కూడా మినహాయింపు ఇవ్వొద్దు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నియమించిన ఇన్‌చార్జీలతో సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలతో మమేకం కావాలి. నా అసెంబ్లీ నియోజకవర్గాన్ని వేరే వారికి అప్పగించండి. నాకు ఏదైనా ఇతర అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు ఇవ్వండి. నేనే వెళ్తా. ఆ నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతా. వారితో కలిసి ఎస్ఐఆర్ విషయంలో పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తా..' అసెంబ్లీ ఎన్నికలకు ముందు 45 లక్షల పార్టీ సభ్యత్వం చేర్పించామని, పార్టీ సభ్యులు ఒక్కొక్కరు ఇంకో ఓటు వేయించడంతో పార్టీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. వచ్చే

## ప్రతి ఓటును కాపాడుకోవాలి

- ఎస్ఐఆర్ సమయంలో అనుసరించాల్సిన తీరుపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్
- హాజరైన మీనాక్షి నటరాజన్ తదితర నేతలు
- బెంగాల్ లో 93 లక్షల ఓట్లను తొలగించారన్న మహేశ్ గౌడ్

## ఏపీలో మరో ప్రైవేటు బస్సు బోల్తా

2లో

కడప జిల్లా గోపవరం మండలంలో ప్రైవేటు బస్సు బోల్తా

గేదె అకస్మాత్తుగా అడ్డు రావడంతో నియంత్రణ కోల్పోయిన డ్రైవర్

ఒక ప్రయాణికుడికి తీవ్ర గాయాలు




## డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి

- రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి 'ఏపీ సైబర్ గార్డ్' ఏర్పాటు
- ఫిర్యాదు అందిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలు
- ఆరు స్తంభాల వ్యవస్థతో సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రణాళిక
- ఏపీలో నేరం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని సీఎం స్పష్టం

"డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్లు చేసి ప్రజలను భయపెడుతూ డబ్బులు దోచుకునే వారే అరెస్ట్ కావాలి. ఆ దిశగా కఠిన చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు శాఖను ఆదేశించారు. ఏళ్ల తరబడి కష్టపడి దాచుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు దోచుకుంటుంటే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఈ పరిస్థితిని అరికట్టాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని సైబర్ నేర రహితంగా మార్చడమే లక్ష్యమని, ఏపీ ప్రజలను మోసం చేస్తే తప్పించుకోలేమనే భయం నేరగాళ్లకు కలగాలని ఆయన హెచ్చరించారు. సచివాలయంలో సైబర్ నేరాల కట్టడిపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

2లో



## సీఎంగా నేడే డీకేఎస్ ఎంపిక

- శాసనసభాపక్ష నేతను ఎన్నుకోనున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఖరారు
- సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించిన గవర్నర్
- మంత్రివర్గంలో చోటు కోసం ఎమ్మెల్యేల యత్నాలు
- ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో సిద్ధరామయ్య, డీకేఎస్ భేటీ
- కొత్త ప్రభుత్వ ఏర్పాటు, కేబినెట్ కూర్పుపై చర్చలు
- సోమవారం డీకేఎస్ ప్రమాణ స్వీకారం

బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై పూర్తిస్థాయి స్పష్టత రావడంతో గందరగోళానికి తెరపడింది. సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయడంతో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ప్రభుత్వ పగ్గాలు చేపట్టడం దాదాపుగా ఖరారైంది. ఇందుకు అవసరమైన ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై కసరత్తు సాగుతోంది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వేర్వేరుగా ఢిల్లీకి చేరుకున్నారు. మంత్రివర్గంలో తమ అనుచర వర్గానికి చోటు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శనివారం సాయంత్రం 4 గంటలకు బెంగళూరు విధానసౌధలో ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభాపక్ష(సీఎల్పీ) సమావేశం జరగనుంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా తదితరులు పాల్గొంటారు. కాంగ్రెస్ అధిష్టానం సూచన మేరకు డీకే శివకుమార్‌ను సీఎల్పీ నేతగా ఎన్నుకోనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ అభ్యర్థిత్వాన్ని కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సూర్జేవాలా ప్రతిపాదించనున్నారు. ఈ ప్రతిపాదనకు పార్టీ ఎమ్మెల్యేలు ఆమోదం తెలపాల్సి ఉంది. సీఎల్పీ నేతను ఎన్నుకున్న

2లో





## పవన్ ఒక ప్యాకేజ్ స్టార్..

### జగన్ ఎక్కువ ఇస్తే అటు వెళతారు

- పవన్ కల్యాణ్‌పై జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్
- పవన్‌ను ప్యాకేజీ స్టార్‌గా అభివర్ణించిన ఎమ్మెల్యే
- ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి పవన్‌కు లేదని వ్యాఖ్య
- తెలంగాణ జోలికొస్తే 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం తప్పదని హెచ్చరిక
- హైదరాబాద్‌లో ఆస్తులు పెట్టుకుని అమరావతి కట్టడంపై ప్రశ్న

2లో

## తమిళనాడులో షోలింగర్ నరసింహస్వామిని దర్శించుకున్న నారా లోకేష్

- తమిళనాడు పర్యటనకు వెళ్లిన లోకేష్
- కొండపైకి రోప్‌వేలో వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు
- 420 మెట్లు నడిచి యోగ ఆంజనేయస్వామి ఆలయ సందర్శన
- లోకేష్ వెంట ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్



మార్గమధ్యలో భక్తులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి నారా లోకేష్ తమిళనాడులో పర్యటించారు. రాణిపేట జిల్లా షోలింగర్‌లోని ప్రసిద్ధ యోగ లక్ష్మీ నరసింహస్వామి వారిని శుక్రవారం ఉదయం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, డాక్టర్ మురళీ మోహన్ ఉన్నారు. షోలింగర్ చేరుకున్న మంత్రి లోకేష్‌కు ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోప్‌వే ద్వారా కొండపై ఉన్న యోగ నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు లోకేష్‌కు వేదాశీర్వచనం అందించి, శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



## అమెరికా ఎంక్యూ9 రీపర్ డ్రోన్ కూల్చివేత

- హార్ముజ్ జలసంధి సమీపంలో ఘటన
- 'అరాశ్‌ఇకమాంగీర్'తో పని పూర్తిచేశామన్న ఇరాన్

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..



# సీఎంగా నేడే డీకేఎస్ ఎంపిక

**(మొదటి పేజీ తరువాయి)**

తర్వాత ఎమ్మెల్యేల మద్దతు లేఖను లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు అందజేస్తారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని గవర్నర్‌కు తెలియజేస్తారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ గవర్నర్ ఆహ్వానిస్తే.. సోమవారం విధానసౌధ వద్ద కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ప్రమాణ స్వీకార శుభముహూర్తం కోసం ఆయన ఇప్పటికే జ్యోతిష్యులను సంప్రదించినట్లు సమాచారం. సోమవారం మంచి ముహూర్తం ఉందని వారు సూచించినట్లు తెలిసింది. విధానసౌధ ఎదుట ప్రమాణ స్వీకారానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఢిల్లీలో సిద్ధరామయ్య, డీకేఎస్

ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం సిద్ధరామయ్య ఢిల్లీకి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేను కలుసుకొని ధన్యవాదాలు తెలియజేశారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గం కూర్పుపై సుమారు గంటకు పైగా చర్చించారు. అలాగే సిద్ధరామయ్య రాజకీయ భవిష్యత్తుపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. జాతీయ రాజకీయాల్లోకి రావాల్సిందిగా ఆయనను మరోసారి ఆహ్వానించినట్లు సమాచారం. ఈ సందర్భంగా సిద్ధరామయ్య వెంట ఆయన కుమారుడు



యతీంద్ర, సీనియర్ మంత్రి కేజే జార్జ్ కూడా ఉన్నారు. ముఖ్యమంత్రిగా ఇప్పటివరకు తనకు అవకాశం కల్పించినందుకు, సహకరించినందుకు అధిష్టానం పెద్దలకు సిద్ధరామయ్య కృతజ్ఞతలు తెలిపారు. డీకే శివకుమార్ సైతం పార్టీ అగ్రనేతలను కలుసుకున్నారు. మంత్రివర్గంలో తన వర్గం ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలుస్తోంది. సిద్ధరామయ్య రాజీనామాకు గవర్నర్ గెహ్లోట్ శుక్రవారం ఉదయం ఆమోదం తెలిపారు. రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తున్నట్లు గవర్నర్ ప్రకటించారు. ఈ మేరకు గెజిట్ విడుదల చేశారు. నూతన సీఎం ప్రమాణస్వీకారం చేసేదాకా ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్ధరామయ్యను గవర్నర్ కోరారు. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కేపీసీసీ ఆదేశించింది. ఢిల్లీలో ఉన్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్, రణదీప్ సింగ్ సూర్జేవాలా శుక్రవారం రాత్రి బెంగళూరుకు తిరిగి వచ్చారు.

మంత్రి పదవుల కోసం లాబీయింగ్

కొత్తగా ఏర్పడనున్న మంత్రివర్గంలో చోటు కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లాబీయింగ్ ప్రారంభించారు. చాలామంది ఎమ్మెల్యేలు ఢిల్లీకి చేరుకుని అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హైకమాండ్‌తో మంత్రివర్గ కూర్పుపై సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో మంత్రుల జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. తమ సన్నిహిత ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కేలా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ అధిష్టానం వద్ద పావులు కదుపుతున్నారు. తమ వర్గానికి అత్యధిక మంత్రి పదవులు దక్కించుకునేందుకు ఇరువురు నేతలు పోటీ పడుతున్నారు. ఈసారి మంత్రివర్గంలో కొత్తముఖాలకు ఎక్కువగా ప్రాధాన్యం దక్కుతుందని ఊహాగానాలు సాగుతున్న తరుణంలో సీనియర్ మంత్రులు, ముఖ్యంగా సిద్ధరామయ్య వర్గీయుల్లో టెన్షన్ పెరుగుతోంది.

# ప్రతి ఓటును కాపాడుకోవాలి

దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)ను పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మిగిలిపోయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియ సమయంలో అనుసరించాల్సిన తీరుపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తమ నేతలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాంధీ భవన్ ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ మాస్టర్ ట్రైనీలకు ఏఐసీసీ శిక్షణ విభాగానికి సంబంధించిన సౌరభ్, అనూష, నిశాంత్ శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనీలు రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో బీఎల్ఏలకు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ ప్రక్రియను పకడ్బందీగా చేశామని వెల్లడించారు. జిల్లా కమిటీలు, మండల కమిటీలు దాదాపు పూర్తి చేశామని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో 93 లక్షల ఓట్లను తొలగించారని.. బీజేపీ చేసిన కుట్రలతో అక్కడ ప్రభుత్వమే మారిపోయిందని మండిపడ్డారు. తెలంగాణలో అలాంటి కుట్రలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు.

# పవన్ ఒక ప్యాకేజ్ స్టార్..

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్‌ను ఒక 'ప్యాకేజ్ స్టార్' అని అభివర్ణిస్తూ, భవిష్యత్తులో వైఎస్ జగన్ ఎక్కువ ప్యాకేజీ ఇస్తే ఆయనకు మద్దతు ఇవ్వడానికి కూడా వెనుకాడరని ఎద్దేవా చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను విమర్శించే స్థాయి, అర్హత పవన్ కల్యాణ్‌కు లేవని అనిరుధ్ రెడ్డి అన్నారు. "దమ్ముంటే తెలంగాణకు వచ్చి ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయండి. ఆయన ఇంటి ముందు నేను అడ్డుగా నిలబడతా" అంటూ పవన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణ బిడ్డల జోలికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవరైనా రావాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే మళ్లీ 'గో బ్యాక్ ఆంధ్ర' ఉద్యమం మొదలవుతుందని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏపీ రాజకీయ నేతల తీరుపై ఆయన మండిపడ్డారు. "మీరంతా ఉండేది హైదరాబాద్‌లో, ఆస్తులు సంపాదించుకునేది ఇక్కడే. మరి అన్ని వేల కోట్లు పెట్టి అమరావతిని ఎందుకు కట్టుకుంటున్నారు?" అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదని, తెలంగాణ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఏపీలో మరో ప్రైవేటు బస్సు బోల్తా

ఏపీలో కొంత కాలంగా వరుసగా బస్సు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. వరుస ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోగా, మరెంతో మంది తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడ్డారు. తాజాగా మరో ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైంది. కడప జిల్లా గోపవరం మండలం పీపీ కుంట సరిహద్దులో బీసీవీఆర్ ట్రావెల్స్ బస్సు ఈ తెల్లవారుజామున బోల్తా పడింది. విజయవాడ నుంచి అనంతపురం జిల్లా కదిరికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం వివరాల్లోకి వెళితే, బస్సు వేగంగా వెళుతున్న సమయంలో ఒక గేదె అకస్మాత్తుగా అడ్డురావడంతో... దాన్ని తప్పించబోయే ప్రయత్నాన్ని డ్రైవర్ చేశాడు. ఈ క్రమంలో నియంత్రణ కోల్పోవడంతో బస్సు బోల్తా కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 30 మంది ఉన్నారు. బస్సు బోల్తా కొట్టినప్పటికీ పెను ముప్పు తప్పింది. కేవలం ఒక ప్రయాణికుడి మాత్రం కాలికి తీవ్ర గాయమయింది. కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే 108 వాహనం ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చేతివృత్తులకు ఉరి.. విశ్వకర్మల బతుకుచిత్రం ఛిద్రం!

- పాత ఫర్నిచర్ దుకాణాలతో ఉపాధికి గండి
- అగమ్యగోచరంగా మనుమయ కుటుంబాల పరిస్థితి
- మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ కు మొరపెట్టుకున్న కార్మికులు
- అందరూ అండగా నిలవాలని నాగవాచారి ఆవేదన

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో విరివిగా వెలుస్తున్న పాత ఫర్నిచర్ దుకాణాల కారణంగా స్థానిక విశ్వకర్మ కుటుంబాలు తీవ్ర ఉపాధి సమస్యలు ఎదుర్కొంటున్నాయని, ఆయా కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ కు వినతిపత్రం అందజేశారు. శ్రీ గోవిందమ్మ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గుడి నిర్మాణ కమిటీ ప్రధాన కార్యదర్శి నాగవాచారి ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం చైర్‌పర్సన్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నాగవాచారి విలేకరులతో మాట్లాడుతూ.. చేతి వృత్తులు కనుమరుగవుతున్న ప్రస్తుత ఆధునిక కాలంలో, ప్రాచీన కులవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న విశ్వకర్మలను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. కులవృత్తుల పరిరక్షణ కోసం విశ్వకర్మలు చేస్తున్న కృషిని ప్రజా ప్రతినిధులు, మేధావులు, కుల పెద్దలు గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. పాత ఫర్నిచర్ వ్యాపారాల వల్ల మనుమయ కుటుంబాల ఆర్థిక పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేతివృత్తుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు దేవరకొండ బాబు చారి తదితరులు పాల్గొన్నారు.



# నిద్రలోనే కన్నుమూసిన వలస కార్మికుడు

- మీనాక్షి ఆగ్రో కెమికల్స్‌లో సెక్యూరిటీ గార్డు మృతి
- గుండెపోటుతో మరణించినట్లు అనుమానాలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న చౌటుప్పల్ పోలీసులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** బ్రతుకుతెరువు కోసం వలస వచ్చిన ఓ కార్మికుడు గుండెపోటుతో నిద్రలోనే మృతి చెందిన ఘటన చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెంలో చోటుచేసుకుంది. చౌటుప్పల్ సీఐ జి. మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సంతోష్ పాశ్వాన్ (52), రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం చౌటుప్పల్ ప్రాంతానికి వలస వచ్చాడు. ప్రస్తుతం అతడు ధర్మోజిగూడెం గ్రామ పరిధిలో ఉన్న మీనాక్షి ఆగ్రో కెమికల్స్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజూ మాదిరిగానే విధుల్లో ఉన్న సంతోష్ పాశ్వాన్, గురువారం (మే 28న) రాత్రి సుమారు 10 గంటల సమయంలో తన గదిలో తోటి కార్మికులతో కలిసి భోజనం చేశాడు. అనంతరం గదిలోనే నిద్రకు ఉపక్రమించాడు. శుక్రవారం (మే 29న) తెల్లవారుజామున 4:40 గంటల ప్రాంతంలో గదిలో ఉన్న తోటి కార్మికులు నిద్రలేచి.. సంతోష్ పాశ్వాన్‌ను నిద్రలేపే ప్రయత్నం చేశారు. ఎంత పిలిచినా అతనిలో ఎలాంటి కదలికలు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సంతోష్‌ను పరీక్షించిన డ్యూటీ డాక్టర్, అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తన తండ్రి గుండెపోటు లేదా ఇతర అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉండవచ్చని మృతుడి కుమారుడు ప్రీతం కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించినట్లు చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# తమిళనాడులో షోలింగర్ నరసింహస్వామిని దర్శించుకున్న నారా లోకేష్

అక్కడి నుంచి సమీపంలోని మరో కొండపై కొలువైన యోగ ఆంజనేయస్వామిని కూడా మంత్రి దర్శించుకున్నారు. కాలినడకన 420 మెట్లు ఎక్కి ఆలయానికి చేరుకుని స్వామివారికి పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్నప్పుడు మార్గమధ్యంలో కనిపించిన భక్తులను లోకేష్ ఆప్యాయంగా పలకరించారు.



# తెలంగాణ అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- అధికారుల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు
- సన్నాహక సమావేశంలో కలెక్టర్ అనురాగ్ జయంతి
- అమరవీరుల స్థూపం వద్ద ప్రత్యేక అలంకరణ

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి ఆయన సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేడుకలకు విచ్చేసే ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అతిథులకు ముందుగానే ఆహ్వాన పత్రికలు అందజేయాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ జరిగే కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రొటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ.. అతిథులు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా సీటింగ్ గ్యాలరీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రగతిని వివరించే నివేదిక, సందేశం కాపీలను చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీఓ) సిద్ధం చేయాలని సూచించారు.

**శాఖల వారీగా బాధ్యతలు..**

అవతరణ వేడుకల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే బాధ్యతను విద్యాశాఖ అధికారులు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వేడుకల ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం ముగిసే వరకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా అమరవీరుల స్థూపం, ప్రధాన వేదికను ఆకర్షణీయంగా అలంకరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏవో అంజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నాకూ మినహాయింపొద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లు గెలవాలని, ఇందుకోసం కనీసం కోటి ఓట్లు రావాల్సి ఉంటుందని అన్నారు. అలా రావాలంటే పార్టీకి సంబంధించిన ఒక్క ఓటు కూడా ఎస్ఐఆర్ ద్వారా పోకుండా ఉండాలని, ఇందుకు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా ఉన్న నేతలు, మంత్రులతో సహా అందరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం ఇందిరాభవన్‌లో జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), అడ్వైజరీ కమిటీ సమావేశాల్లో ముఖ్యమంత్రి మాట్లాడారు. 'ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ఈ కార్యక్రమంపై పార్టీ పక్షాన అవగాహన పెంచుకోవాలి. ఎస్ఐఆర్ కారణంగా వలసదారుల ఓట్లకు ఇబ్బంది రావచ్చు. వారి ఓట్లు పోకుండా చూడాలి. లంబాడీ, ఆదివాసీ, మైనార్టీ, దళిత, మహిళా ఓట్ల విషయంలో సమస్యలు రావచ్చు. ఈ సమస్యల పరిష్కారమెలా అన్న దానిపై బూత్‌స్థాయి కార్యకర్తలకు అవగాహన కల్పించాలి. గతంలో పార్టీ డిజిటల్ సభ్యత్వం చేర్పించిన వారికి ఈ విషయంలో కీలక బాధ్యతలు అప్పగించాలి. ఎస్ఐఆర్ కోసం 119 అసెంబ్లీ నియోజకవర్గాలు, 17లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమించాలి. అసెంబ్లీ ఇన్‌చార్జులు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందే. వారు సరిగా పనిచేస్తేనే ఓట్లు పోకుండా ఉంటాయి. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్‌లోని నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించాలి. హైదరాబాద్ నగర పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలి. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్లస్టర్ వారీ సమావేశాలు నిర్వహించాలి..' అని సీఎం సూచించారు. కొందరు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరుపై ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సోషల్ మీడియాలో శిక్షణ ఇవ్వాలి**

'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ కేడర్ పూర్తిగా సోషల్ మీడియా వారియర్లుగా మారిపోయి పనిచేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు మనం సోషల్ మీడియాలో వీక్ అయ్యాం. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు జమీందార్లు అయ్యారు. సోషల్ మీడియాలో తమ వ్యక్తిగత ప్రచారం తప్ప పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయనివ్వడం లేదు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు రీచ్ కావడం లేదు. ఎమ్మెల్యేలు పాల్గొన్న కార్యక్రమాలు, ఎంపీలు కొబ్బరికాయలు కొట్టిన కార్యక్రమాలే సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. పార్టీ కోసం ఎలాంటి ప్రచారం జరగడం లేదు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు సోషల్ మీడియాలో శిక్షణ ఇవ్వాలి. నేతలు ఈ తీరును సరిచేసుకోవాలి. నేతలు కార్యకర్తల వద్దకు వెళితేనే, కార్యకర్తలు బూత్‌స్థాయిలో ఓటరు వద్దకు వెళ్తారన్న విషయాన్ని గమనించాలి. జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు కూడా కార్యకర్తల వద్దకు వెళ్లి కలవాలి. నేను కూడా 10 రోజులకోసారి క్షేత్రస్థాయికి వెళ్లి పార్టీ కార్యకర్తలను కలుస్తా. నెలలో మూడు రోజులు పార్టీకి కేటాయిస్తా. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లందరూ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి..' అని సీఎం చెప్పారు. పలువురు మంత్రులు, పార్టీ నేతలు మాట్లాడుతూ ఎస్ఐఆర్‌తో పాటు పార్టీ నిర్మాణంపై పలు సూచనలు చేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టుల నియామకంలో ఆచితూచి వ్యవహరించాలని, పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని, సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.



# జాతీయ స్థాయిలో మెరిసిన ‘శివారెడ్డిగూడెం‘

- ఆన్‌లైన్ సేవల కల్పనలో ‘జాతీయ సేవా సమృద్ధి‘ పురస్కారం
- అసోం మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక గ్రామ పంచాయతీ

**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు):** యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అసోం రాజధాని గౌహతిలో జరిగిన జాతీయ పంచాయతీ సదస్సులో శివారెడ్డిగూడెంకు ప్రతిష్టాత్మక ‘జాతీయ సేవా సమృద్ధి‘ అవార్డు వరించింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో అసోం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రజిత రెడ్డి ఈ పురస్కారాన్ని సగర్వంగా అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలకు ఈ-సేవలను (ఆన్‌లైన్ సేవలు) నూరు శాతం పారదర్శకంగా, పూర్తిస్థాయిలో అందిస్తున్నందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసిందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం మొత్తంలో ఈ అవార్డుకు ఎంపికైన ఏకైక గ్రామ పంచాయతీ శివారెడ్డిగూడెం కావడం విశేషమన్నారు. చిన్న పంచాయతీ అయినప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలు, ఈ-సేవల అమలులో చూపుతున్న చొరవకు ఈ పురస్కారం దక్కిందని, రానున్న రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, సీఈవో నాగేశ్వరరావు, యాదాద్రి జిల్లా జెడ్పీ సీఈవో శోభారాణి, డీఎల్‌పీఓ ప్రతాప్ నాయక్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, ఎంపీఓ మజీద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన సేవల కోసమే ‘ప్రత్యేక డిస్కం‘

- నిరంతరాయ విద్యుత్ సరఫరాయే ప్రభుత్వ లక్ష్యం
- వ్యవసాయ రంగానికి మరింత ఊతం
- ఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రభుత్వ విప్ వేముల వీరేశం
- పాల్గొన్న ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**తొలివెలుగు, రామన్నపేట:** వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ, రైతులకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ‘రైతు డిస్కం‘ (ప్రత్యేక విద్యుత్ పంపిణీ సంస్థ) ఏర్పాటుకు అడుగులు వేస్తోందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న రైతు డిస్కంపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో రామన్నపేటలో ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న విద్యుత్ పంపిణీ వ్యవస్థ ద్వారా వ్యవసాయ, గృహ, పారిశ్రామిక అవసరాలకు ఒకే మార్గంలో విద్యుత్ సరఫరా జరుగుతోందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రత్యేకంగా వ్యవసాయ రంగానికే పరిమితమైన విద్యుత్ పంపిణీ వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. తద్వారా రైతులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు.. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, లైన్ల సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించేందుకు వీలవుతుందని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ కీలక నిర్ణయం పట్ల ప్రజల నుంచి, ముఖ్యంగా అన్నదాతల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సైతం రైతు డిస్కం ఆవశ్యకతను వివరించారు. ఈ సదస్సులో రైతులు, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పేదల పెన్నిధి.. ఉపాధి హామీ!





- కూలీలకు అండగా నిలుస్తున్న వంద రోజుల పని
- సొంత ఖర్చుతో అన్నప్రసాద వితరణ చేసిన సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ
- అధికారులతో కలిసి పనుల పర్యవేక్షణ

**తొలివెలుగు, చౌటుప్పల్ :** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంద రోజుల పని కల్పిస్తూ, వారి ఆర్థిక పురోభివృద్ధికి ఎంతో తోడ్పాటునందిస్తోందని స్వాములవారి లింగోటం గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ అన్నారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని స్వాములవారి లింగోటం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పాతికేళ్ల క్రితం గ్రామాల్లో సరైన ఉపాధి అవకాశాలు లేక పేదలు వలసబాట పడుతున్న తరుణంలో, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అప్పటి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్, అప్పటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వంటి దిగ్గజాల ఆలోచనల నుంచి ఈ చారిత్రాత్మక పథకం రూపుదిద్దుకుందని గుర్తు చేశారు. ఈ పథకం ప్రారంభమై 25 వసంతాలు పూర్తి చేసుకున్నా.. నేటికీ గ్రామీణ పేద, మధ్యతరగతి కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తోందని కొనియాడారు.

**సొంత ఖర్చులతో భోజనాలు:**

విధులు ముగించుకున్న కూలీల కోసం సర్పంచ్ ప్రదీప్ తన సొంత ఖర్చులతో వినూత్నంగా మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం కూలీలతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేసి వారిలో నూతనోత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాతరాజు ధనుంజయ్య, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, దేవస్థానం చైర్మన్ కుర్నాల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చేవెళ్లి కృష్ణ, యూత్ అధ్యక్షుడు చొప్పరి సాయి కుమార్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్ర విక్రమ్ గౌడ్, నాయకులు బోడిగే ఆనంద్ గౌడ్, గంగాపురం నరహరి, పులిగిల్ల ఇస్తారి, ఢిల్లీ మల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గంగాపురం గంగాధర్, మాజీ దేవస్థానం అధ్యక్షులు ఢిల్లీ జనార్దన్ రెడ్డి, తూర్పింటి ఎల్లయ్య, తూర్పింటి రమేష్, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ చికిలంమెట్ల కళమ్మ, ఆశవర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ యవనికపై పోచంపల్లి ఇక్కత్ ఖ్యాతి

- కాన్ చలనచిత్ర వేత్సవాల్లో జిగేల్‌మనిపించిన తెలంగాణ చేనేత
- బ్రాండ్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్‌కు శంషాబాద్‌లో ఘన స్వాగతం
- చేనేత సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యత: రష్మీ ఠాకూర్




**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు):** తెలంగాణ నేతన్నల నైపుణ్యం ఖండాంతరాలు దాటింది. అద్భుతమైన కళాఖండాలకు చిరునామా అయిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు అంతర్జాతీయ వేదికపై తళుక్కుమన్నాయి. ఫ్రాన్స్ రాజధాని పారిస్ వేదికగా జరిగిన 79వ కాన్ చలనచిత్ర వేత్సవాల్లో (క్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్) ‘పోచంపల్లి టు కాన్స్‘ అనే నినాదంతో తెలంగాణ ఇక్కత్ బ్రాండ్ అంబాసిడర్, మిస్ ఏసియా పసిఫిక్ రష్మీ ఠాకూర్ చేనేత వస్త్రాలతో రెడ్ కార్పెట్‌పై నడిచి ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. ఈ పర్యటనను విజయవంతంగా ముగించుకుని శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు చేనేత కళాకారులు ఘన స్వాగతం పలికారు. పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో తడక రమేశ్ ఆధ్వర్యంలో 30 మంది మహిళా చేనేత కళాకారులు విమానాశ్రయానికి చేరుకుని రష్మీ ఠాకూర్‌కు చేనేత శాలువా కప్పి, పూల బొకేలు అందించి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలను రష్మీ ఠాకూర్ ప్రదర్శించి మురిసిపోయారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మన వారసత్వ చేనేత ఇక్కత్ కళను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఉద్ఘాటించారు. కాన్ ఉత్సవాల్లో తెలంగాణ చేనేతకు ప్రాతినిధ్యం వహించడం చారిత్రాత్మకమని, అంతర్జాతీయ వేదికపై భారతీయ చేనేతకు దక్కిన ఈ గౌరవం ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. తరతరాలుగా వస్తున్న కార్మికుల అద్వితీయ కళా నైపుణ్యమే ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిందని, ఈ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని రష్మీ ఠాకూర్ పేర్కొన్నారు. ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో తడక రమేశ్ మాట్లాడుతూ.. భారతీయ నేతన్నల ప్రతిభకు, ముఖ్యంగా పోచంపల్లి ఇక్కత్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు రావడం గర్వకారణమన్నారు. ఈ అరుదైన వేదికపై చేనేత కళకు పెద్దపీట వేసిన రష్మీ ఠాకూర్‌కు కళాకారుల పక్షాన ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన భారత ప్రభుత్వానికి, వీవర్స్ సర్వీస్ సెంటర్ (తెలంగాణ) అధికారి అరుణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, కార్మిక సంఘం డైరెక్టర్ గుర్రం హేమలత, కళాకారులు తాటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# ఎండీ రహీం మృతి సీపీఎంకు తీరని లోటు

- పార్థివదేహంపై ఎర్రజెండా కప్పి నివాళులు
- సంతాపం తెలిపిన సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్
- కన్నీటి పర్యంతమైన పార్టీ శ్రేణులు, ఆవాజ్ కమిటీ సభ్యులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన సీపీఎం చౌటుప్పల్ మున్సిపాలిటీ 9వ వార్డు సహాయ కార్యదర్శి, ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు ఎండీ రహీం అకాల మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ విచారం వ్యక్తం చేశారు. రహీం ఆకస్మిక మరణవార్త తెలుసుకున్న ఆయన హుటాహుటిన చౌటుప్పల్‌కు చేరుకుని పార్థివదేహాన్ని సందర్శించారు. రహీం మృతదేహంపై పార్టీ ప్రతిష్టాత్మక ఎర్రజెండాను కప్పి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మైనార్టీల హక్కుల సాధనకు ఆవాజ్ కమిటీ ద్వారా రహీం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. వార్డు స్థాయిలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ. ఇక్బాల్, దుర్గ కాశీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్కే. ఇమాంపాషా, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, పార్టీ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్టీవో పాషా పాల్గొన్నారు. వారితో పాటు సీపీఎం సీనియర్ నాయకులు బండారు నరసింహ, దండా అరుణ్ కుమార్, గుణముని ఐలయ్య, భావనలపల్లి స్వామి, బొడ్డు అంజిరెడ్డి, కందగట్ల ఆనంద్, యాట బాలరాజు, ఎండీ ఇబ్రూ, నరేష్, బలరాం రెడ్డి, నెల్లికట్టు నరసింహ, గుణముని రాములు తదితరులు పాల్గొని అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు.

# అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

- రఘునాథపురం వాగులో ఇసుక ట్రాక్టర్ పట్టివేత
- ధర్మారెడ్డి గూడేనికి చెందిన వాహనంగా గుర్తింపు
- యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన ఎస్సై లింగారెడ్డి

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ, పర్యావరణానికి హాని కలిగిస్తూ సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై రాజాపేట పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల పరిధిలోని రఘునాథపురం వాగు నుంచి శుక్రవారం ఉదయం భారీ ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతున్నట్లు స్థానికుల నుంచి పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన ఎస్సై లింగారెడ్డి తన సిబ్బందితో కలిసి ఉదయం 8:30 గంటల సమయంలో వాగు పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఓ స్వరాజ్ ట్రాక్టర్ (టీజీ 30 టీ 5639) వాగులో ఇసుక లోడుతో పట్టుబడింది. పోలీసులు వెంటనే ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో డ్రైవర్ పేరు వేముల చందు అని, అతను ధర్మారెడ్డి గూడెం గ్రామానికి చెందినవాడని తేలింది. ట్రాక్టర్ యజమాని శివరాత్రి ప్రవీణ్ ఆదేశాల మేరకే తాను ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు డ్రైవర్ అంగీకరించాడు. దీంతో వెంటనే ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ చందుతో పాటు యజమాని శివరాత్రి ప్రవీణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగారెడ్డి వెల్లడించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.


# అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

- రఘునాథపురం వాగులో ఇసుక ట్రాక్టర్ పట్టివేత
- ధర్మారెడ్డి గూడేనికి చెందిన వాహనంగా గుర్తింపు
- యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన ఎస్సై లింగారెడ్డి

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ, పర్యావరణానికి హాని కలిగిస్తూ సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై రాజాపేట పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల పరిధిలోని రఘునాథపురం వాగు నుంచి శుక్రవారం ఉదయం భారీ ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతున్నట్లు స్థానికుల నుంచి పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన ఎస్సై లింగారెడ్డి తన సిబ్బందితో కలిసి ఉదయం 8:30 గంటల సమయంలో వాగు పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఓ స్వరాజ్ ట్రాక్టర్ (టీజీ 30 టీ 5639) వాగులో ఇసుక లోడుతో పట్టుబడింది. పోలీసులు వెంటనే ట్రాక్టర్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో డ్రైవర్ పేరు వేముల చందు అని, అతను ధర్మారెడ్డి గూడెం గ్రామానికి చెందినవాడని తేలింది. ట్రాక్టర్ యజమాని శివరాత్రి ప్రవీణ్ ఆదేశాల మేరకే తాను ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు డ్రైవర్ అంగీకరించాడు. దీంతో వెంటనే ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ చందుతో పాటు యజమాని శివరాత్రి ప్రవీణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగారెడ్డి వెల్లడించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.




# రైతుల పాలిట శాపంగా కాంగ్రెస్ ప్రభుత్వం

- జూన్ మొదటి వారంలోగా పూర్తిస్థాయిలో వడ్లు కొనుగోలు చేయాలి
- అన్నదాతల గోస పట్టించుకోని పాలకుల తీరుపై భారాస ధ్వజం
- పోచంపల్లిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన గులాబీ శ్రేణులు
- ప్రభుత్వ తీరుపై మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి మండిపాటు

**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు):** రైతులురురురు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వడ్ల కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ శుక్రవారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని నేతాజీ చౌరస్తా వద్ద భారాస (బీఆర్ఎస్) మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు కల్లాలకు ధాన్యం తీసుకొచ్చి రెండు నెలలు గడుస్తున్నా కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లలో జాప్యం చేస్తుంటే, మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం కొనుగోలు చేయకుండా రైతుల ఉసురు పోసుకుంటున్నాయని దుయ్యబట్టారు. కొనుగోళ్లు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా.. ఇప్పటి వరకు 40 శాతం ధాన్యం కూడా సేకరించకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. స్థానికంగా సుమారు 19 లక్షల బస్తాల ధాన్యం ఉత్పత్తి కాగా, కేవలం 7 లక్షల బస్తాలు మాత్రమే కొనుగోలు చేశారని గణాంకాలతో సహా వివరించారు.

**ప్రణాళికా లోపంతోనే సమస్యలు:**

మరోవైపు మృగశిర కార్తె సమీపిస్తోందని, ఏ క్షణాన వర్షం వస్తుందోనని రైతులు భయం గుప్పెట్లో బతుకుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందన్నారు. పోచంపల్లి ప్రాంతంలో పండిన వడ్లను స్థానిక రైస్ మిల్లులకు ఇవ్వకుండా నారాయణపూర్, బీబీనగర్, వలిగొండ మండలాలకు చెందిన ధాన్యాన్ని ఇక్కడకు అటాచ్ చేసి అధికారులే సమస్యలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రైవేటు గోదాములను అద్దెకు తీసుకుని ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేయాలని డిమాండ్ చేశారు. మిల్లర్ల దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసి, వేగంగా కొనుగోళ్లు పూర్తి చేయకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కందడి భూపాల్ రెడ్డి, మండల, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి, సీతా వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ బత్తు లింగస్వామి యాదవ్, నాయకులు రావుల శేఖర్ రెడ్డి, సామ రవీందర్ రెడ్డి, ముత్యాల మహిపాల్ రెడ్డి, పగిళ్ల సుధాకర్ రెడ్డి, నోముల మాధవ రెడ్డి, చిలువేరు లక్ష్మయ్య, కందడి సుధాకర్ రెడ్డి, బత్తుల శ్రీశైలం గౌడ్, గుండు మధు, బండి కృష్ణ గౌడ్, చిలువేరు బాలనరసింహ, గునిగంటి మల్లేష్ గౌడ్, రంగ విశ్వనాథం, ప్యాట శేఖర్, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్, చింతకింది కిరణ్, సీత శ్రవణ్, నోముల ఉపేందర్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు 'ఇసుక' కష్టాలు

# యాప్‌తో ఆగిన పేదల సొంతింటి కల

- 'మన ఊరు- మన ఇసుక' యాప్‌లో కనిపించని స్థానిక వాగు
- ఆత్మకూరు (ఎం)లో 186 ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిపివేత
- కాళేశ్వరం ఇసుక కొనుగోలుతో లబ్ధిదారులపై అదనపు భారం
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న బాధితులు



**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు తీవ్ర ఇసుక కొరతతో కుంటుపడ్డాయి. సొంతింటి కలను నిజం చేసుకునేందుకు ఆశగా పనులు మొదలుపెట్టిన పేదలకు తాజా పరిస్థితులు గుదిబండగా మారాయి. ఆత్మకూరు (ఎం) మండలానికి తొలి విడతలో మొత్తం 356 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 130 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరో 40 ఇళ్లు చివరి దశలో ఉన్నాయి. అయితే, ఇసుక కొరత కారణంగా సుమారు 186 ఇళ్లు స్లాబ్, గోడలు, ప్లాస్టరింగ్ తదితర దశల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

**తప్పని 'యాప్' తిప్పలు.. నిలిచిన అనుమతులు:**

ఇందిరమ్మ ఇళ్లకు చలాన్ లేకుండా, నామమాత్రపు ఛార్జీలతో స్థానిక బిక్కేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక సరఫరా జరగాల్సి ఉంది. కానీ, అధికారులు నిర్ణయించిన ధరల పట్టిక గిట్టుబాటు కాకపోవడంతో ట్రాక్టర్ యజమానులు ఇసుక సరఫరా నిలిపివేశారు. ఆ తర్వాత లబ్ధిదారుల నుంచి దూరాన్ని బట్టి ట్రిప్పుకు రూ. 3 వేల నుంచి రూ. 4 వేల వరకు వసూలు చేస్తూ.. రెండు ట్రిప్పులకు రూ. 900 చలాన్ చెల్లించి రెవెన్యూ అధికారుల అనుమతితో సరఫరా చేశారు. కానీ, ఇటీవల ప్రభుత్వం 'మన ఊరు - మన ఇసుక' యాప్‌ను తీసుకురావడంతో రెవెన్యూ అధికారులు పాత (ఆఫ్‌లైన్) అనుమతులను పూర్తిగా రద్దు చేశారు. యాప్ ద్వారానే ఇసుక బుక్ చేసుకోవాలని అధికారులు చెబుతుండగా, ఆ యాప్‌లో ఆత్మకూరు (ఎం) పరిధిలోని బిక్కేరు వాగు ఆప్షన్ కనిపించడం లేదు. కేవలం మోత్కూరు, మోటకొండూరు మండలాల బిక్కేరు వాగులు మాత్రమే కనిపిస్తున్నాయి. అంత దూరం నుంచి ఇసుకను తీసుకురావడం రవాణా ఖర్చుల రీత్యా సాధ్యం కాకపోవడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

**కాళేశ్వరం ఇసుకతో అదనపు భారం:**

ఆఫ్‌లైన్ పర్మిషన్లు నిలిచిపోవడంతో.. ఎలాగైనా ఇళ్లు పూర్తి చేయాలనే ఆరాటంతో కొందరు లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారు. స్థానికంగా ఇసుక దొరకకపోవడంతో రెట్టింపు ధర వెచ్చించి ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా ఇసుక దొరకకపోవడం వల్లే ఈ అదనపు భారం మోయాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించి స్థానిక బిక్కేరు వాగు నుంచే ఇసుక ఇప్పించాలని కోరుతూ లబ్ధిదారులు, ట్రాక్టర్ యజమానులు ఇటీవల అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

**స్థానిక వాగు నుంచే ఇసుక ఇవ్వాలి (బాధిత లబ్ధిదారుడు)**

"మొదటి విడతలో ప్రభుత్వం నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ప్రారంభంలో ఇసుక దొరికింది. అధికారుల పర్యవేక్షణ బాగుండడంతో పనులు వేగంగా జరిగాయి. కానీ, ప్రస్తుతం ఇసుక దొరకడం లేదు. యాప్‌లో బుక్ చేసుకుంటే మోత్కూరు, మోటకొండూరు వెళ్లమంటున్నారు. అధికారులు స్పందించి స్థానిక బిక్కేరు వాగు నుంచే ఇసుక ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
**వి. లావణ్య, తహసీల్దార్, ఆత్మకూరు(ఎం)**

"మండలంలో ఇసుక సరఫరా అంతా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగా నేరుగా పర్మిషన్లు ఇవ్వడాన్ని నిలిపివేశాం. ఇందిరమ్మ ఇళ్లకు, ఇతర నిర్మాణాలకు ఏర్పడిన ఇసుక కొరత సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం."





# గిల్ గర్జన..

ముల్లన్‌పూర్ : ఐపీఎల్19వ సీజన్‌లో బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ (47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96) మెరుపులకు.. రాజస్థాన్ రాయల్స్ పోరాటానికి తెరపడింది. 15 ఏండ్ల ఈ యువ కెరటం ఆడిన మరో అద్భుత ఇన్నింగ్స్ ఆ జట్టును ఫైనల్ చేర్చలేకపోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104) క్లాసిక్ సెంచరీతో చేసిన గర్జనకు తోడు సాయి సుదర్శన్ (32 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 58) సత్తా చాటడంతో రాజస్థాన్‌కు చెక్ పెట్టిన గుజరాత్ టైటాన్స్ మూడోసారి తుదిపోరుకు దూసు కెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2లో జీటీ 7 వికెట్ల తేడాతో రాయల్స్‌ను చిత్తు చేసింది. ఆర్ఆర్ ఇచ్చిన 215 టార్గెట్‌ను 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 214/6 స్కోరు చేసింది. వైభవ్‌తోపాటు జడేజా (45నాటౌట్) చివర్లో ఫెరీరా (11 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 38 నాటౌట్) కూడా రాణించారు. హోల్డర్, రబాడ చెరో రెండు వికెట్లు తీశారు. గిల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో ఆర్సీబీతో జీటీ అమీతుమీ తేల్చుకోనుంది.

### కెప్టెన్ గిల్ ముందుండి

క్వాలిఫయర్-1లో తేలిపోయిన గుజరాత్ టాపార్డర్ ఈసారి అద్భుతంగా ఆడింది. ఓపెనర్లు సుదర్శన్, గిల్ తొలి వికెట్‌కు 167 రన్స్ జోడించి ఫైనల్‌కు బాట వేశారు. భారీ ఛేదనలో క్లాసిక్ షాట్లతో హోరెత్తించారు. ఏ ఒక్క బౌలర్‌ను వదలకుండా శిక్షించి ఛేజింగ్‌ను వన్‌సైడ్ చేశారు. ఫామ్‌లో ఉన్న ఆర్చర్ తొలి ఓవర్లోనే చెరో రెండు ఫోర్లతో తమ ఉద్దేశం ఏంటో చెప్పారు. ఆర్చర్‌ను టార్గెట్ చేసిన గిల్ మరో రెండు ఫోర్లు రాబడితే.. బర్గర్, తుషార్‌కు సుదర్శన్ రెండేసి బౌండరీలతో స్వాగతం పలికాడు. ఓపెనర్ల జోరుకు పవర్‌ప్లేను 69/0తో ముగించింది. ఆ తర్వాత గిల్‌గేరు మార్చి మరింత స్పీడు పెంచారు. తుషార్ వేసిన తొమ్మిదో ఓవర్లో 6,4,4 బాది 30 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోవడంతో పాటు స్కోరు వంద దాటించాడు. పదో ఓవర్లో బంతిని అందుకున్న జడేజాను 6,6,4తో శిక్షించడంతో స్టేడియం హోరెత్తింది. కెప్టెన్‌ను చూసి సుదర్శన్ సైతం వేగం అందుకున్నాడు. యశ్‌రాజ్ బౌలింగ్‌లో తొలి సిక్స్ కొట్టి అర్ధ శతకం అందుకున్నాడు. ఈ జోరు చూస్తుంటే ఇద్దరే లక్ష్యాన్ని కరిగించేలా కనిపించారు. కానీ, బ్రిజేశ్ వేసిన 13వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన సాయి.. ఐదో బాల్‌ను కట్ షాట్‌తో బౌండరీకి పంపే ప్రయత్నంలో జారి పోయిన బ్యాట్ వికెట్లపై పడటంతో గత మ్యాచ్ మాదిరిగా హిట్ వికెట్‌గా ఔటయ్యాడు. జడ్డూ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా ఫోర్ కొట్టి సెంచరీ (47 బంతుల్లో) పూర్తి చేసుకున్న గిల్‌ను తర్వాతి ఓవర్లో ఆర్చర్ ఎల్బీ చేసినా అప్పటికే మ్యాచ్ జీటీ చేతుల్లోకి వచ్చేసింది. తెవాటియా (17 నాటౌట్), సుందర్ (16), బట్లర్ (9 నాటౌట్) లాంఛనం పూర్తి చేశారు.

### పట్టువదలని సూర్యవంశీ

తన స్టయిల్‌కు భిన్నంగా పరిస్థితులకు తగ్గట్టుగా ఆడిన వైభవ్ ముందుండి నడిపించగా.. చివర్లో ఫెరారీ మెరుపు బ్యాటింగ్‌తో రాజస్థాన్ మంచి స్కోరు చేసింది. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు వచ్చిన ఆ టీమ్‌కు ఆరంభంలోనే వరుస ఎదురుదెబ్బలు తగిలాయి. సిరాజ్ తొలి ఓవర్లోనే ఓపెనర్ జైస్వాల్ (1)ను ఔట్ చేయగా.. రెండో ఓవర్లో జురెల్ (7)ను రబాడ వెనక్కుపంపడంతో ఆర్ఆర్ 9/2తో నిలిచింది. అయితే నాలుగో నంబర్‌లో వచ్చిన జడేజాతో కలిసి వైభవ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తీసుకున్నారు. పిచ్ నుంచి అంతగా సహకారం లేకపోవడం.. ప్రత్యర్థి పేసర్లు షార్ట్ పిచ్ బాల్స్, బౌన్సర్లతో పరీక్షిస్తుండగా.. వైభవ్ తన శైలికి భిన్నంగా జాగ్రత్తగా ఆడుతూనే చెత్త బాల్స్‌ను మాత్రం శిక్షించాడు. సిరాజ్ వేసిన మూడో ఓవర్లోనే మూడు ఫోర్లు కొట్టిన అతను రబాడ వేసిన 153 కి.మీ స్పీడ్ బంతిని స్ట్రెయిట్ సిక్స్‌గా కొట్టడం ఇన్నింగ్స్‌కే హైలైట్. మరో ఎండ్‌లో జడేజా కూడాక్రమం తప్పకుండా బౌండరీలు రాబట్టడంతో పవర్‌ప్లేను రాజస్థాన్ 70/2తో ముగించింది. చేతి నొప్పి కారణంగా జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. తొమ్మిదో ఓవర్లో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ పరాగ్ (11) 4,6 కొట్టి ఔటయ్యాడు. అతనితో పాటు షనక (3)ను హోల్డర్ పెవిలియన్ చేర్చగా.. మధ్యలో ప్రసిధ్ బౌలింగ్‌లో వైభవ్ ఇచ్చిన క్యాచ్‌ను సుదర్శన్ డ్రాప్ చేశాడు. అప్పటికి 46 రన్స్ వద్ద ఉన్న వైభవ్ ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్నాడు. ప్రసిధ్ బౌలింగ్‌లో ఆర్చర్ (7) కీపర్‌కు చిక్కడంతో 118/5తో నిలిచిన జట్టును సూర్యవంశీ ఆదుకున్నాడు. 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న అతను మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చిన జడేజా తోడుగా స్పీడు పెంచాడు. రబాడ, సిరాజ్ ఓవర్లలో ఒక్కో సిక్స్ కొట్టిన వైభవ్.. హోల్డర్ వేసిన 16వ ఓవర్లో 4,6,6తో స్కోరు 150 దాటించాడు. ఆపై స్పిన్నర్ సుందర్‌ను రెండు సిక్సర్లతో శిక్షించిన వైభవ్ సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ, 18వ ఓవర్లో రబాడ షార్ట్ పిచ్ బాల్‌ను అప్పర్ కట్ షాట్ ఆడిన సూర్య.. ప్రసిధ్‌కు క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. ప్రసిధ్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు, స్పిన్నర్ రషీద్ వేసిన ఆఖరి ఓవర్లో నాలుగు సిక్సర్లతో విరుచుకుపడిన ఫెరీరా జట్టుకు మంచిస్కోరు అందించాడు.

### సంక్షిప్త స్కోర్లు

రాజస్థాన్: 20 ఓవర్లలో 214/6 (వైభవ్ 96, జడేజా 45 నాటౌట్, హోల్డర్ 2/27, రబాడ 2/35);
గుజరాత్: 18.4 ఓవర్లలో 219/3 (గిల్ 104, సుదర్శన్ 58, ఆర్చర్ , బర్గర్1/35)



# నూతన భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

- వంగపల్లి దివ్యాంగుల పునరావాస కేంద్రంలో కలెక్టర్ తనిఖీ
- వసతులు, విద్యాబోధన, శిక్షణపై ఆరా
- పది పాసైన దివ్యాంగ విద్యార్థికి ప్రత్యేక అభినందనలు
- సౌకర్యాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తామని హామీ

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/ యాదగిరిగుట్ట:** దివ్యాంగ విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యాబోధన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. మండల పరిధిలోని వంగపల్లి గ్రామంలో ఉన్న దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న సేవలు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో ఎంతమంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు? వారి వయోపరిమితి ఎంత? తదితర వివరాలను అధికారులను అడిగి నమోదు చేసుకున్నారు. దివ్యాంగ పిల్లల సంరక్షణ కోసం, వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం కోసం ఎంతమంది సిబ్బంది విధుల్లో ఉన్నారనే విషయంపై కలెక్టర్ ఆరా తీశారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి అందిస్తున్న విద్య, పునరావాస సేవలు, ప్రత్యేక నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం, కేంద్రం కోసం నూతనంగా నిర్మిస్తున్న భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. పనుల్లో వేగం పెంచి, భవనాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కేంద్రానికి ఇంకా ఏమేం సదుపాయాలు అవసరం ఉన్నాయో నిర్వాహకులను అడిగి తెలుసుకున్న కలెక్టర్.. అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చేందుకు జిల్లా యంత్రాంగం తరఫున చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, ఇదే కేంద్రం నుంచి ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షలు రాసి, ఉత్తీర్ణత సాధించిన ఓ దివ్యాంగ విద్యార్థిని కలెక్టర్ అనురాగ్ జయంతి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. దివ్యాంగ పిల్లలకు కేవలం విద్యను అందించడమే కాకుండా, సమాజంలో వారు నిలదొక్కుకునేలా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని ఆయన పేర్కొన్నారు. ఆ విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో) నాగిరెడ్డితో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు, పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



# యాదాద్రిలో జన జాతర!





- ఆధ్యాత్మిక శోభతో స్వామివారి గిరి ప్రదక్షిణ
- స్వాతి నక్షత్రం పురస్కరించుకుని పోటెత్తిన భక్తులు
- లాంఛనంగా ప్రారంభించిన ఆలయ అర్చకులు, అధికారులు
- ఉదయం 30 వేల మందికి పైగా స్వామివారి దర్శనం
- కిక్కిరిసిన క్యూలైన్లు.. దర్శనానికి భక్తుల ఇక్కట్లు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధి శుక్రవారం భక్తజన సంద్రంగా మారింది. స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణకు భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో యాదగిరిగుట్ట కొండ కింద కోలాహలం నెలకొంది.

### భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ:

ఉదయం 5 గంటలకు భక్తులు భారీ సంఖ్యలో వైకుంఠ ద్వారం వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు వైకుంఠ ద్వారం వద్ద ఉన్న స్వామివారి పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు మూడు గంటల పాటు కొనసాగిన ఈ ప్రదక్షిణలో భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణతో ఆలయ పరిసరాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉదయం ఏడు గంటల సమయానికి కొండ కింది ప్రాంతమంతా భక్తుల రాకతో నిండిపోయింది.

### దర్శనానికి ఇక్కట్లు:

గిరి ప్రదక్షిణ అనంతరం భక్తులంతా ఒక్కసారిగా స్వామివారి దర్శనానికి కొండపైకి చేరుకోవడంతో రద్దీ



విపరీతంగా పెరిగింది. క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోవడంతో స్వామివారి దర్శనం కోసం భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఉదయం స్వామివారి దర్శనానికి ఒకేసారి దాదాపు 30 వేల మంది భక్తులు విచ్చేసినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. రద్దీకి అనుగుణంగా భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




# పాడి రైతుల ఆగ్రహం.. చిల్లింగ్ సెంటర్ ముట్టడి

- రాజాపేట మదర్ డెయిరీ గేటుకు తాళం వేసి నిరసన
- పెండింగ్‌లో ఉన్న 7 బిల్లులు వెంటనే చెల్లించాలి
- కాలయాపన చేసినందుకు వడ్డీతో సహా ఇవ్వాలని డిమాండ్
- పట్టించుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

**తొలివెలుగు, రాజాపేట:** పాల బిల్లుల చెల్లింపులో మదర్ డెయిరీ యాజమాన్యం అనుసరిస్తున్న తీరుపై పాడి రైతులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలోని మదర్ డెయిరీ చిల్లింగ్ సెంటర్‌ను రైతులు ముట్టడించారు. పాముకుంట గ్రామానికి చెందిన పాడి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి చిల్లింగ్ సెంటర్ ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు విడుదల చేశామని మదర్ డెయిరీ యాజమాన్యం కేవలం ప్రకటనలకే పరిమితమై, గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఒక్క రూపాయి కూడా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి రైతులు రాత్రింబవళ్లు కష్టపడి, అప్పులు తెచ్చి మరీ పశువులను పోషిస్తూ డెయిరీకి పాలు పోస్తుంటే.. యాజమాన్యం బిల్లులు ఇవ్వకుండా తీవ్ర కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో తాము తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న 7 బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, నెలల తరబడి బిల్లులు ఆపి రైతులను ఇబ్బంది పెట్టినందుకు గాను బకాయిలను వడ్డీతో సహా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. అధికారులు వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డెయిరీ పరిధిలోని మిగతా గ్రామాల రైతులను సైతం ఏకం చేసి పెద్ద ఎత్తున ధర్నాలకు దిగుతామని పాముకుంట గ్రామ పాడి రైతులు తేల్చిచెప్పారు.

# యాదాద్రిలో వైభవంగా గిరి ప్రదక్షిణ

- స్వాతి నక్షత్రం పురస్కరించుకుని తెల్లవారుజామునే పూజలు
- పాల్గొన్న ఈవో భవానీ శంకర్, బండ్రు శోభారాణి
- హాజరైన ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇంజ మహేష్ మాదిగ

**తొలివెలుగు, రాజపేట/ యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం 5:30 గంటలకు ఆలయ ఈవో భవానీ శంకర్ ఆధ్వర్యంలో స్వామివారి పాదుకల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని



లాంఛనంగా ప్రారంభించారు. ఈ గిరి ప్రదక్షిణలో తెలంగాణ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణితో కలిసి దళిత రత్న, శ్రమశక్తి అవార్డు గ్రహీత, ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఇంజ మహేష్ మాదిగ పాల్గొన్నారు. స్వామివారి నామస్మరణల నడుమ ఆధ్యాత్మిక శోభతో సాగిన ఈ ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఉదయం సమయంలో వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉండటంతో భక్తులు ప్రశాంతంగా ప్రదక్షిణను పూర్తి చేసుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

# ఉద్యమకారుల ప్రతినిధుల సభను జయప్రదం చేయాలి

- పిలుపునిచ్చిన ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న
- రేపు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర స్థాయి సమావేశం
- కేకే కమిటీ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

**తొలివెలుగు, వలిగొండ:** ఈ నెల 31వ తేదీన హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధుల సభను విజయవంతం చేయాలని ఆ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి



నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి పిలుపునిచ్చారు. వలిగొండ మండల కేంద్రంలో శుక్రవారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ భేటీలో పాల్గొన్న నాయకులు రేపు జరగబోయే రాష్ట్ర స్థాయి సభ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'కేకే కమిటీ'ని ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, అలాగే కేకే కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో జరిగే ప్రతినిధుల సభలో కేకే కమిటీ ముఖ్య నాయకులు పాల్గొని ఉద్యమకారుల ఫోరం నాయకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారని వెల్లడించారు. కావున ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులందరూ పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు గంధమల్ల బాలయ్య, జిల్లా కార్యదర్శి బత్తిని రవీందర్ గౌడ్, నాయకులు కదిరేణి స్వామి, మల్లం వెంకటేశం, బొడిగే సుదర్శన్, ఐటిపాముల పుష్పమ్మ, ఎక్కలదేవి శ్రీనివాస్, కొండూరు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల ప్రతిభావంతులకు ఐ ఫౌండేషన్ సన్మానం

- రవీంద్రభారతిలో ఘనంగా పురస్కారాల ప్రదానం
- దూది వెంకటాపురం విద్యార్థిని, ప్రధానోపాధ్యాయురాలికి సత్కారం
- హాజరైన ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్




**తొలివెలుగు, రాజాపేట:** పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాజధానిలో ఘన సన్మానం లభించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రభుత్వ పాఠశాలల్లో 560 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు, వారిని ఆ దిశగా తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయులను మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా 'ఐ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ ప్రతిభా పురస్కారాల మహోత్సవంలో రాజాపేట మండల పరిధిలోని దూది వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని గుళ్లెన తేజస్విని, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (జిహెచ్ఎం) విజయలక్ష్మి ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉద్యమనేత ప్రొఫెసర్ కోదండరాం, భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని కొనియాడారు. వసతుల లేమిని అధిగమించి కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి (డిఈఓ) రోహిణి మాట్లాడుతూ.. విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరవలేనిదని, ఇలాంటి సత్కారాలు వారిలో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని పేర్కొన్నారు. ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుతారపు రవీందర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ వేడుకలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కస్తూరి శ్రీధర్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞశర్మ, ప్రముఖ మోటివేషనల్ వక్త గంపా నాగేశ్వర్‌రావులతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమ్మెకు సీపీఐ సంఘీభావం

- 8వ రోజుకు చేరిన భావన రుషి కార్మికుల ఆందోళన
- దీక్షా శిబిరం వద్ద 'వంటా-వార్పు'తో నిరసన
- ఆరేళ్లుగా కూలి రేట్లు పెంచకపోవడం దారుణం: సీపీఐ నేత చిక్క వెంకటేశం
- మానవతా దృక్పథంతో సమస్యను పరిష్కరించాలని యాజమాన్యాలకు వినతి

**తొలివెలుగు, రాజాపేట:** మండలం రఘునాథపురంలో భావన రుషి చేనేత కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేస్తున్న సమ్మె పట్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటాన్ని నిరసిస్తూ.. కార్మికులు దీక్షా శిబిరం వద్దే శుక్రవారం వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. రోడ్డుపైనే వంటలు చేసుకుని భోజనాలు చేసి తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి సీపీఐ (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా) నాయకులు మద్దతు ప్రకటించారు. సీపీఐ నేత చిక్క వెంకటేశం దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మికుల పట్ల యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుబట్టారు. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి కార్మికులకు వేతనాలు పెంచాల్సి ఉండగా, గత ఆరేళ్లుగా కూలి రేట్లు పెంచకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రోజువారీ కూలికి వెళితే గానీ పూటగడవని కార్మికులు, తమ హక్కుల సాధన కోసం వారం రోజులుగా పని మానేసి సమ్మె చేస్తున్నా యాజమాన్యాలు ఏమాత్రం స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత రోజుల్లో నిత్యావసర సరుకులతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు రెండింతలు పెరిగిపోయాయని, కానీ కార్మికులు చేస్తున్న రెక్కల కష్టానికి మాత్రం తగిన ప్రతిఫలం దక్కడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా యాజమాన్యాలు మొండి వైఖరి విడనాడి, మానవతా దృక్పథంతో కార్మికుల సమస్యలను అర్థం చేసుకుని తక్షణమే కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రచ్చ నర్సింహులు, గ్రామ శాఖ సీపీఐ కార్యదర్శి, పలువురు కార్యకర్తలు, చేనేత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






# భక్తిశ్రద్ధలతో చల్లూరులో దుర్గామాత ఉత్సవాలు

- నేడు అంగరంగ వైభవంగా సామూహిక బోనాలు
- రేపు భక్తుల ఆధ్వర్యంలో మహా వనభోజనాలు
- ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేసిన గ్రామ ప్రజాప్రతినిధులు
- హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని సర్పంచ్ దంపతుల పిలుపు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో దుర్గామాత పండుగ ఉత్సవాలు ఈ వారాంతంలో అత్యంత వైభవంగా జరగనున్నాయి. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ఈ ఆధ్యాత్మిక వేడుకలను కన్నుల పండువగా నిర్వహించేందుకు గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ సర్పంచి భీమగాని రూప బాల నరసయ్య గౌడ్, ఉపసర్పంచ్ బొంత సుధాకర్ తదితరులు పలువురు ప్రముఖులకు, అధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

**రెండు రోజుల పాటు ఆధ్యాత్మిక సందడి:**

ఉత్సవాల్లో భాగంగా తొలిరోజైన శనివారం (30వ తేదీన) గ్రామంలోని మహిళలు, భక్తులు అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పించనున్నారు. డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు జరగనుంది. అనంతరం ఆదివారం (31వ తేదీన) గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి సామూహిక వనభోజనాలు చేయనున్నారు. ఈ పండుగ ద్వారా గ్రామంలోని ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం వెల్లివిరుస్తుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న అల్లం ఇన్నారెడ్డిని గ్రామ ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని, చల్లని తల్లి దుర్గామాత ఆశీస్సులు పొందాలని సర్పంచ్ భీమగాని రూప బాల నరసయ్య గౌడ్, ఉపసర్పంచ్ బొంత సుధాకర్, కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ఒక ప్రకటనలో కోరారు.

# ప్రభుత్వ దవాఖానాలపై ప్రజల నమ్మకం నిలబెట్టాలి!

- నాణ్యమైన వైద్యం అందించడం సిబ్బంది బాధ్యత
- ఆత్మకూరు పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- రోగులకు అందుతున్న సేవలపై ఆరా
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరగాలి
- పనితీరు ఆధారంగా ప్రతి నెలా సిబ్బందికి రేటింగ్
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/ఆత్మకూరు(ఎం):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి స్పష్టం చేశారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, వైద్య సేవల తీరుతెన్నులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ నిత్యం ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్ల (ఓపీ) సంఖ్య, రోగులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో మంజూరైన పోస్టులు ఎన్ని? ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు? వైద్యులు, సిబ్బంది రోజూ సమయానికి విధులకు హాజరవుతున్నారా లేదా? అన్న వివరాలపై రికార్డులను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు నేరుగా వెళ్లిన ఆయన, వారి ఆరోగ్య పరిస్థితిని, ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి స్వయంగా అడిగి



తెలుసుకున్నారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లపై వైద్యాధికారులకు తగిన సూచనలు చేశారు.

**ప్రభుత్వ దవాఖానాలపై విశ్వాసం పెంచాలి..**

ఈ నెలలో పీహెచ్‌సీలో ఎన్ని ప్రసవాలు జరిగాయి, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎన్ని డెలివరీలు నమోదయ్యాయి అనే వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. గర్భిణులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా ప్రభుత్వ దవాఖానాలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని సూచించారు. అలాగే, మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ) వంటి దీర్ఘకాలిక వ్యాధులతో (ఎన్‌సీడీ) బాధపడుతున్న రోగులను ఏ విధంగా ట్రాక్ చేస్తున్నారని వైద్యాధికారులను ప్రశ్నించారు. అటువంటి రోగులకు నిరంతరం ఫాలోఅప్ నిర్వహించాలని, క్రమం తప్పకుండా మందులు అందించాలని స్పష్టం చేశారు. పీహెచ్‌సీల పనితీరుపై ఇకనుంచి ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తామని, సిబ్బంది పనితీరు ఆధారంగా రేటింగ్ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) మనోహర్, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, ఇతర ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

